# అనాథ

-టి. రామచంద్రరావు

**సత్యనారాయణగారికి హార్ట్‌అటాక్ వచ్చింది. సుచేత నర్సింగ్‌హోమ్‌లో చేర్పించారు. ట్రీట్‌మెంట్ జరుగుతోంది. ఆయన స్పృహలో లేరు. అనుక్షణం డాక్టరు పర్యవేక్షణలో మందులిస్తూ కంటికి రెప్పలా కనిపెట్టి చూస్తోంది నర్సు. ఆయన ముఖంపై ఆక్సిజన్ మాస్క్ ఉంది. గుమ్మం బయట అలికిడి అయితే తల తిప్పి చూసింది నర్సు. "ఆయనకెలా ఉంది?" అని అడిగాడతను.**

**"రండి...మీ కోసమే ఆయన కలవరిస్తున్నారు."**

**కుర్చీని సత్యనారాయణగారి మంచానికి దగ్గరగా వేసి అతన్ని కూర్చోమని చెప్పింది నర్సు. ఆయన చెవి దగ్గరగా ముఖం పెట్టి "మీ అబ్బాయి వచ్చారు" అంటూ అతని చేతిని పట్టుకుని ఆయన చేతిలో పెట్టింది నర్సు. అతని కరస్పర్శ కోసం పరితపించి పోతున్నట్లు ఆయన వ్రేళ్లు బిగుసుకున్నాయి.**

**"అంత అపస్మారక స్థితిలో కూడా ఆయన మిమ్మల్నే తలచుకున్నారు. మీరు రావడం మంచిదయింది. చివరి చూపు దక్కింది"**

"సారీ సార్! మా డ్యూటీ మేము చేసాము. అంతకన్నా ఎవరు చేయగలిగింది ఏమీలేదు''

ఆయనలో కదలిక!

"సత్యనారాయణగారూ! మీ అబ్బాయి వచ్చారు. కొంచెం కళ్లు తెరవండి'' అని ఆయన చెవి దగ్గర పదేపదే చెప్పింది నర్సు.

ఆమె గొంతు ఆయన మస్తిష్కానికి చేరినట్టుంది. ఏదో అనూహ్యమైన శక్తి ఆయన కళ్లు తెరిపించింది.అతని చేతివేళ్లు బిగుసుకున్నాయి. రెండవ చేతితో ఆయన చేతిని నిమిరాడతను. ఆయన కళ్లల్లో కొన్ని క్షణాలపాటు ఒక అద్భుతమైన మెరుపు. "ఎలా వుంది?'' అని అడిగాడతను. ఆయన చిన్నగా తల పంకించారు. తనకి బావుందనా? అతను వచ్చినందుకు సంతోషంగా ఉందనా? అతనికి అర్థం కాలేదు. ఆయన కళ్లు తదేకంగా అతన్నే చూస్తుండిపోయాయి కొంత సేపు. అతనికేమనాలో తెలియలేదు.

"మందులవల్ల ఆయనకి మగతగా ఉంది. కానీ మీరాయన చేతులు పట్టుకున్నారని ఆయనకి తెలుస్తూనే వుంది. కొన్ని గంటలుగా కనిపించని కళ ఆయన ముఖంలో కనిపిస్తోంది. మీరు రావడం చాలా మంచిదయింది.''

"జరిగింది తెలిసాక రాకుండా ఎలా ఉండగలను?'' ఆమె అవునన్నట్లు తల పంకించింది.

కాసేపయ్యాక "మీరు కాసేపు కూర్చుంటారా నేను కాస్త తిని వస్తాను'' అంది నర్సు.

"అలాగే సిస్టర్''

ఆమె తిరిగి వచ్చేవరకూ అతనలాగే ఆయన చేతిని పట్టుకుని కూర్చున్నాడు.

"మీరు కూడా ఏదైనా తిని రండి.''

"ఊహూ... ఇప్పుడేమీ తినాలని లేదు''

"అవున్లెండి. నాన్నగారికిలా ఉంటే ఎలా తినాలనిపిస్తుంది'' ఏదో అనబోయి ఆగిపోయాడు.

"ఏమిటీ చెప్పాలనుకున్నారు?''

"ఏంలేదు''

ప్రక్కనేవున్న ఫ్లాస్కులోని కాఫీని కప్పులో పోసి "ఇదైనా త్రాగండి'' అందామె.

"అరె...మీకెందుకు శ్రమ?''

"ఇందులో శ్రమేముంది? అందామె.

★★★

తెలతెలవారుతుండగా అలసి నిద్రపోతున్న నర్సుని "సిస్టర్'' అని పిలిచాడతను.

ఆమె ఉలిక్కిపడి లేచి కూర్చుంది.

"ఆయన చేయి ఇంత చల్లగా ఉందేమిటి?''

నర్సు గబగబా నాడి పట్టుకుని చూసింది. గబగబా బయటకు పరుగెత్తి డాక్టర్ని పిలుచుకువచ్చింది. ఆయన పెద్దగా పరీక్ష చేయాల్సిన అవసరం రాలేదు. "సారీ'' అని చూస్తున్నట్టున్న ఆయన కళ్లని మూసేసాడు.

"మీ అదృష్టం. ఆయన చివరి చూపు దక్కింది. ధైర్యంగా ఉండండి. అంతిమ క్షణంలో కొడుకును చూసుకున్నానన్న తృప్తితో ఆయన వెళ్లిపోయారు.

"నా దురదృష్టం. నేనాయన కొడుకును కాను'' అన్నాడతను. నర్సు తెల్లబోయింది.

"అరే మీరే ఆయన కొడుకనుకున్నాను. ఆయన కూడా అలాగే ప్రవర్తించారు. మరి మీకేమవుతారని రాత్రంతా నిద్రాహారాలు మానేసి మీరాయన పక్కన కూర్చున్నారు.''

"తండ్రి వదిలేసిన కొడుకును నేను. కొడుకు వదిలేసిన తండ్రి ఆయన. అదే మా ఇద్దరి మధ్య సంబంధం.''

"అంటే ఓల్డేజ్ హోమ్‌లో ఆయన్ని చేర్పించింది మీరు కాదా?''

"నేనే ఆయన కొడుకునైతే ఆయన్ని ఎప్పుడూ హోమ్‌లో చేర్పించేవాడ్నికాదు.''

"ఆయనకి హార్ట్‌అటాక్ వచ్చిన సంగతి ఆయన కొడుక్కి తెలుసా?''

"తెల్సుండదు''

"పోనీ ఇప్పుడైనా ఆయనకి ఫోన్ చేసి చెప్పండి.''

"అతనెక్కడున్నాడో ఎవరికీ తెలీదు. మూడేళ్లక్రితం ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించిన కొడుకు మళ్లీ ఆయన్ని చూడడానికి రాలేదుట.''

"మీ కోసమే ఎదురు చూస్తున్నట్లు కనిపించాడాయన. ఎన్నాళ్లనుంచి మీకీ పరిచయం?''

"నాకెవరూలేరు. నా తల్లిదండ్రులు ఎవరో నాకు తెలియదు. పసి బిడ్డగా ఉండగా మెట్లమీద వదిలి వెళ్లిపోతే నేను అనాధాశ్రమంలో పెరిగాను. నన్నెవరో అజ్ఞాత వ్యక్తి చదివిస్తూ ఉండేవారని మా ఆశ్రమం మేనేజర్ చెప్పేవారు. ఆ పుణ్యాత్ముడెవరో తెలుసుకోవాలని ఎంతో ప్రయత్నించాను. కానీ నా అన్వేషణ ఫలించలేదు. నాలాంటి మరో అనాధకి ఆసరాగా నిలిచి ఆయన ఋణం తీర్చుకోవాలనుకున్నాను. అలా అన్వేషిస్తూ వచ్చినప్పుడే నాకీయనతో పరిచయమైంది.''


"అంటే మీరాయన కొడుకు కాదని చివరి క్షణంలో ఆయనకి తెలుసన్నమాట''

"మంచో చెడో నేను మొదటిరోజునే ఒక అబ

ద్ధమాడాను. హోమ్‌లో చేర్పించిన కొడుకు ఆర్థిక సాయం చేయకపోవడంకన్నా అసలు వచ్చి చూడలేదన్న బాధ ఆయన్ని ఎక్కువగా కృంగదీస్తుందని హోమ్ మేనేజర్‌గారు నాతో చెప్పారు. ఎంత గుర్తుపట్టలేని స్థితిలో వున్నా నేనే ఆయన కొడుకునని నమ్మించలేనుకదా. రిజిస్టర్‌లో నమోదయిన ఆయన కొడుకు పేరు తెలుసుకుని అతను ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడనీ, అక్కడి ఇబ్బందులవల్ల స్వయంగా వచ్చి చూడలేకపోతున్నానని, ఆయన్ని కనిపెట్టి చూడమని నాతో చెప్పాడని వెళ్లినప్పుడల్లా కొత్త కథ చెబుతూ వచ్చాను. రెండేళ్లుగా నేను ఆడిన నాటకంఈరోజుతో ముగిసిపోయింది'' అన్నాడు.

"కాదు... మీలోనే ఆయన తన కొడుకును చూసుకున్నారు. దూరంగా ఉన్నా తన కొడుకు బాధ్యత వహిస్తున్నాడనుకున్నారు. అదే ఇంత కాలం ఆయన్ని బ్రతికించింది'' అంది నర్సు.

"తన కొడుకు కోసం ఆయనెంత పరితపించి పోయారో నాకు తెలుసు. ఎన్ని పనులున్నా హోమ్‌కి వచ్చి ప్రతి పదిహేను రోజులకి ఆయన్నోసారి చూసి కాసేపు ఆయన దగ్గర గడిపి వెడుతున్నాను. నిన్న సాయంత్రం కూడా అదే ఉద్దేశ్యంతో వచ్చాను. అకస్మాత్తుగా గుండెపోటు వస్తే ఆయన్నిక్కడ చేర్పించారని తెలిసింది.''



"ఇప్పుడు మీకేమని చెప్పాలో అర్థం కావడం లేదు'' అంది ఆమె.

"మీ ప్రాబ్లమ్ ఏమిటో నాకు తెలుసు. బ్రతికినంతకాలం ఆయనకి నేనున్నానని చెప్పుకుంటూ వచ్చిన వాడ్ని చనిపోయాక ఆయన్ని అనాధగా వదిలి వెళ్లిపోతానా సిస్టర్. ఆయన అంత్యక్రియలు నేనే జరిపిస్తాను.  నేనీలోగా హోమ్ మేనేజర్‌గారిని తీసుకువస్తాను. డాక్టర్‌గారితో చెప్పి బిల్లు ఎంతయిందో చెప్పి తీసుకురండి. నేనే పే చేస్తాను. హోమ్‌వారి మీద ఈ బరువు పెట్టడం నాకు భావ్యం కాదు'' అన్నాడతను.

"మీలాంటి ఉత్తములు ఉండగా సత్యనారాయణగారి లాంటి తండ్రులెప్పటికీ అనాధలు కారు'' అంది నర్సు కళ్లనీళ్లతో.

★